క్లుప్తంగా...

సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

జీడిమెట్ల: ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జీడిమెట్లలోని హమాలీ అడ్డా వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డీ.యూసుఫ్, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

వృథాగా నాలాలోకి ఫాక్స్‌సాగర్ నీరు



జీడిమెట్ల: ఎండాకాలంలో నీరు లేక చెరువులు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నీటిని పొదుపు చేయాలని అవగాహన కల్పించాల్సిన అధికారులే నీటిని వృథా చేస్తున్నారు. ఫాక్స్‌సాగర్‌లో ఉన్న నీటిని ఇరిగేషన్ అధికారులు మురుగునీటి నాలాల్లోకి వృథాగా వదిలేస్తున్నారు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు నీటి ఎద్దడితో తల్లడిల్లుతుంటే .. మరోవైపు అధికారులు ఇలా నీటిని వృథాగా వదలడం దేనికని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటిని పొదుపు చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



జగద్గిరిగుట్ట: చింతల్ పద్మానగర్‌లో మంగళవారం రూ.24 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కాలనీలో దాదాపు అన్ని రోడ్లు పూర్తయ్యాయి. కేవలం స్ట్రీట్ నెంబర్ 11లో పనులు పెండింగ్ ఉండేది. ఇటీవలే పలు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో సంక్షేమ సంఘం నాయకులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో స్పందించిన అధికారులు రోడ్డు పనులు ప్రారంభించారు. కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

రాజీవ్ యువ వికాసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



దుండిగల్: రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్ కోరారు. దుండిగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్‌ను మంగళవారం అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోనివారు ఫామ్ నింపి మున్సిపల్ కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధృవపత్రం, కులం సర్టిఫికెట్ జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటో, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లను దరఖాస్తు ఫారానికి జత చేయాల్సి ఉంటుందన్నారు.

ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

జీడిమెట్ల: దొంగలను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడతాయని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ అన్నారు. గాంధీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జల్దా రాఘవులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధేది!

ఆకర్షణీయమైన ప్యాకింగ్, వంటకాల వాసనలు, నోరూరించే ఆహార పదార్థాలు, బయట హోటళ్లు, తోపుడు బండ్లలో కనిపిస్తుంటాయి. భోజన ప్రియులను ఆకట్టుకునే ప్రయత్నం బాగున్నా.. అందులో వినియోగించే నాసిరకం సరుకులు, హానికరమైన రంగులతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది.

– సాక్షి,సిటీబ్యూరో



- కిష్టాపూర్‌లో ఇటీవల 47 క్వింటాళ్ల ఆహార పదార్థాలు సీజ్
- శుభ్రత పాటించని ఆహార విక్రయశాలలు
- మాంసం క్రయవిక్రయాల్లోనూ అపరిశుభ్రత

పట్టించుకోని అధికార యంత్రాంగం

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలక సంఘాలు, పలు పంచాయతీల్లోని చాలా హోటళ్లు, ఆహారపదార్థాలు, తినుబండారాల తయారీదారులు నిబంధనలు పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

దాడుల్లో విస్తుపోయే విషయాలు

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఇటీవల రాష్ట్ర ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) టాస్క్‌ఫోర్స్ బృందం పసుపు, కారం, మసాలాల తయారీకేంద్రాలతో సహా నిల్వ, విక్రయ కేంద్రాలు, పలు రెస్టారెంట్లపై దాడులు నిర్వహించగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. మేడ్చల్ మండలం కిష్టాపూర్‌లో హైదరాబాద్ ఫుడ్ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో దాడులు నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ బృందం ఆహార పరిరక్షణ ఉల్లంఘనలను గుర్తించింది.

శుభ్రత శూన్యం

పారిశుద్ధ్య లోపంతో సహా మసాలా పొడుల ఉత్పత్తి, నిల్వ విభాగాలలో పరిశుభ్రత లేదని గుర్తించారు. కలుషిత వాతావరణంతో నేల శుభ్రంగా లేకపోవడం, పైకప్పు మీద బూజు, స్పైడర్ వెబ్స్ ఉన్నట్లు బృందం నిర్ధారించింది. ఆహారపదార్థాల నిల్వ, పికిల్స్, అల్లం, వెల్లుల్లి పేస్ట్ వంటి పదార్థాలు పూర్తిగా శుభ్రత లేని కారణంగా ఫంగస్‌తో కూడిన ప్లాస్టిక్ కంటైనర్లలో నిల్వ చేయటం, కీటకాలు, పురుగులు పట్టిన కొబ్బరి పొడి, ఎండుమిర్చిని ముడి పదార్థాల స్టోర్‌రూమ్‌లో గుర్తించారు.

రూ.3.03 లక్షల విలువైన కల్తీ పదార్థాల నిల్వ

అధికారుల తనిఖీల్లో 46.75 క్వింటాళ్ల సెమీ ఆహార పదార్థాలు (పికిల్స్, అల్లం, వెల్లుల్లి పేస్ట్), మసాలా పొడులు కలిగి ఉన్న రూ.3.03 లక్షల విలువైన నిల్వను సీజ్ చేసి నమూనాలను ల్యాబ్‌కు పంపించారు.

దుర్వాసన ఉన్న పదార్థాలు ధ్వంసం

మురికిగా ఉన్న కంటైనర్లు, ఫంగస్ పెరిగిన పదార్థాలు, తేదీలు లేనివి, అధిక దుర్వాసనతో ఉన్న ఉత్పత్తులను ధ్వంసం చేశారు. అపరిశుభ్రత వాతావరణంలో తుప్పు పట్టిన మిషనరీ ఉపయోగించి పలు ఆహార పదార్థాలు తయారీ చేస్తున్నట్లు గుర్తించిన టాస్క్‌ఫోర్స్ బృందం సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయడంతో పాటు అనుమానిత ఆహార పదార్థాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపింది. ఇదే పరిస్థితి శివారుల్లో అంతటా నెలకొని ఉన్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు గాలికి

ఇబ్బడిముబ్బడిగా హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, తినుబండారాల తయారీ కేంద్రాలు వెలిశాయి. ఆహార పదార్థాల తయారీదారులు, విక్రేతలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాలను పాటిస్తూ.. శుభ్రతతోపాటు తాజా సరుకులతో పదార్థాలను తయారు చేయాలి. చాలా కేంద్రాలు ఈ నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి.

వినియోగదారుల చట్టం ప్రకారం..

వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం తినుబండారాల తయారీలో శుభ్రత, నాణ్యత విధిగా పాటించాల్సి ఉండగా.. గ్రేటర్ శివారు జిల్లాల్లో అమలుకు నోచుకోవడం లేదు. కూడళ్లు, చౌరస్తాలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సమీప ప్రాంతాలతో పాటు హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారితోపాటు హైదరాబాద్–నిజామాబాద్ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపుల ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు.

రహదారులపై నిత్యం రద్దీగా..

ప్రతిరోజూ వాహనాల రాకపోకలతో రహదారులు దుమ్ము, ధూళి ఆహారపదార్థాలపై పడుతోంది. నిర్వాహకులు వాటిని అలాగే విక్రయిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నూడుల్స్, ఫ్రైడ్ రైస్ తయారీ తర్వాత ప్లాస్టిక్ పాత్రలు, కవర్లలో వడ్డిస్తున్నారు. ఆహార పదార్థాలపై ఎలాంటి రక్షణ చర్యలు లేక ఈగలు, దోమలు వాలుతున్నాయి.

మాంసం విక్రయాల్లోనూ అంతే

నగర శివారుల్లోని 29 పురపాలక సంఘాలతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లో కూడా పరిశుభ్రత పాటించడం లేదు.

పర్యవేక్షణ లోపం

ఆహార భద్రతాధికారి పోస్టులు ఖాళీగా ఉండడంతో పాటు పురపాలక సంఘాల్లో కూడా హెల్త్ ఆఫీసర్లు లేకపోవడంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయ విక్రయ కేంద్రాల్లోని పదార్థాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో క్రయవిక్రయ కేంద్రాలను నడిపే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీ



ఎంపీకి సమస్యలు వివరిస్తున్న విజయ్‌కుమార్

సుభాష్‌నగర్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీని ఆయన నివాసంలో కలిసి సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని దయానందనగర్‌లో నెలకొన్న తాగునీటి, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

నేతల హౌస్ అరెస్ట్



జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు

జగద్గిరిగుట్ట: గచ్చిబౌలిలో ఉన్న యూనివర్సిటీ భూములపై ధర్నాలో పాల్గొనడానికి వెళ్లకుండా మంగళవారం బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్‌ను వారి నివాసంలో అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు కార్పొరేటర్ రావుల శేషగిరి, 121 డివిజన్ అధ్యక్షులు బాలు యాదవ్, భూపాల్ రెడ్డి, రాజిరెడ్డి, జగన్ ముదిరాజ్, ముత్యాలు, భిక్షపతి సుధాకర్, రాజు నేతలను అరెస్టు చేశారు.

మండుటెండలోనూ విద్యుత్ వెలుగులు



గిరినగర్‌లో పగలు వెలుగులు జిమ్ముతున్న వీధి దీపం

రంగారెడ్డినగర్: వీధి దీపాల నిర్వహణ అధికారుల నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు లేక రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరికొన్ని పగలు, రేయి తేడా లేకుండా నిరాటకంగా వీధి దీపాలు వెలుగుతూ కనిపిస్తున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్‌లో మంగళవారం పలు గల్లీలో మధ్యాహ్నం వేళ వీధి దీపాలు వెలుగుతూ కనిపించాయి. చీకటి పడగానే దీపాలు వెలగడం, వెలుతురు రాగానే ఆటోమెటిక్‌గా ఆఫ్ అయ్యేలా ఏర్పాటు చేసిన టైమర్లు సరిగా పనిచేయక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. చాలా చోట్ల టైమర్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో పగలూ వీధి దీపాలు వెలుగులు జిమ్ముతున్నాయి. ఇప్పటికైనా టైమర్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని నిలిపివేయాలి : సీపీఎం



కీలుకాని లక్ష్మణ్, సీపీఎం మండల కార్యదర్శి

కుత్బుల్లాపూర్: హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పోరాటాల మీద, నాయకుల మీద నిర్బంధం పెరిగిందని విమర్శించారు. సదరు స్థలాన్ని యూనివర్సిటీ అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం నిర్వహించే నిరసనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

భూములమ్మడం సరికాదు

నిజాంపేట్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని దాదాపు 400 ఎకరాల భూమిని చవక ధరకు అమ్మడం సరికాదని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రకృతిని, మూగజీవాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూ ఘటనపై ఎస్ఎఫ్ఐ నిరసన



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నిజాంపేట్ : రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రగతినగర్ మంకీ స్టాచ్యూ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులను యూనివర్సిటీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. తక్షణమే భూముల అమ్మకాన్ని రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నందేశ్వర్, ప్రణయ్, అజయ్, శివ, సాయిరామ్, సిద్ధార్థ్, చందు, మధు, భరత్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నిర్మాతపై ఫిర్యాదు

ఆల్విన్‌కాలనీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నిర్మాత పంజాల జైహింద్ గౌడ్‌పై కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీరమల్ల కేశవరావు ఆధ్వర్యంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 11 సంవత్సరాల్లో బీసీ కమిషన్‌ ఏర్పాటు చేస్తూ చట్టబద్ధత కల్పించడంతో పాటు కేంద్ర మంత్రులలో ఎక్కువమంది బీసీలకు స్థానం కల్పించారన్నారు.
మన రాష్ట్రం నుంచి బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మణ్‌ను నియమించారని గుర్తు చేశారు. బీసీల సంక్షేమానికి పాటుపడుతున్న నరేంద్ర మోదీ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన జైహింద్‌గౌడ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డి, రామరాజు, మణిభూషణ్, నర్సింగ్ యాదవ్, హరియాదవ్, నర్సింగరావు, కమలాకర్ రెడ్డి, నరసింహచారి, గోపాల్‌రావు, శంకర్, టప్పు రఘు, సాయి, వంశీ రెడ్డి, వెంకటస్వామి రెడ్డి, రేషన్ రాజు, జ్యోతి, మమత, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



నిజాంపేట్‌లో సన్న బియ్యాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంతరెడ్డి



కొంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న భైరి భాస్కర్‌గౌడ్ తదితరులు

- హర్షం వ్యక్తం చేస్తున్న పేదలు
- సీఎం చిత్రపటానికి నాయకుల క్షీరాభిషేకం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాల్లో ప్రారంభించారు. నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని రేషన్ దుకాణాల వద్ద సన్న బియ్యాన్ని తీసుకునేందుకు కార్డుదారులు బారులు తీరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు రేషన్ దుకాణాల వద్ద హంగామా చేస్తూ సన్న బియ్యాన్ని అందించారు. కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాలు నిర్వహించారు.



దుండిగల్‌లో .. పంపిణీ చేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి



సుభాష్‌నగర్‌లో .. పంపిణీ చేస్తున్న పౌర సరఫరాల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్

సంక్షేమ బోర్డు ఏర్పాటు ఘనత కాంగ్రెస్‌దే

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య గౌడ్

జగద్గిరిగుట్ట: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ అన్నారు. మంగళవారం ఆస్‌బెస్టాస్ కాలనీ కమాన్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం అడ్డా అధ్యక్షులు ఎండీ యూసుఫ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 65 సంవత్సరాలు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికునికి సంక్షేమ బోర్డు నుంచి రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని, సమస్యల పరిష్కారానికి సీఎంను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. సమావేశంలో మదన్, సాయి, జనార్దన్, ఆరోగ్య రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ ఔట్‌లేక కాలనీల్లోకి మురుగు నీరు



రోడ్డుపై చేరిన మురుగు నీరు

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

దుండిగల్: మన ఇంట్లోని బాత్రూమ్‌లో కొద్దిగా దుర్వాసన వస్తేనే ముక్కు మూసుకుంటాం. అలాంటిది ఇంటి చుట్టు మొత్తం డ్రైనేజీ నీరు చేరి మురుగు వాసన కంపు కొడితే ఎలా ఉండగలరు.. ఎలా భోజనం చేయగలరు.. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని సర్వే నంబరు 294 రామచంద్రయ్య కాలనీలు ఉన్నాయి. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రణీత్ అంటీల, 21 సెంచరీ, ఆర్టీసీ కాలనీ, ఎస్ఆర్ఎస్, క్రాంతినగర్ కాలనీ ప్రాంతాలకు చెందిన సుమారు 35 వేల ఫ్లాట్లకు సంబంధించిన డ్రైనేజీ నీరు ఈ ప్రాంతాలకు నిత్యం వస్తుంది. ఆయా ప్రాంతాలకు డ్రైనేజీ ఔట్‌లెట్ లేకపోవడంతో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ నుంచి దుండిగల్ మున్సిపాలిటీలోని సర్వే నంబరు 294, రామచంద్రయ్య కాలనీల్లోకి భారీగా మురుగు నీరు చేరుతుంది. ఇదే విషయంపై గతంలో స్థానికులు, నాయకులు పలుమార్లు ఇరు మున్సిపాలిటీల కమిషనర్లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఆయా కమిషనర్లు పరిష్కార మార్గం చూపలేదు. దీంతో స్థానిక ప్రజలు నిత్యం కంటి మీద కునుకు లేకుండా.. తీవ్ర దుర్వాసనల మధ్యే బతుకు జీవుడా అంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుని మురుగు నీటి సమస్యను పరిష్కరించి స్థానిక ప్రజలకు విముక్తి కలిగిస్తారా.. లేదా షరామామూలుగా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.



ఇళ్లలోకి చేరిన మురుగు నీరు